
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 1 మార్చి 2024

3న పల్స్ పోలియో

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈ నెల 3న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 0-5 ఏళ్ల పిల్లలు 18,6212 మంది ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 1,137 బూత్‌లు, 38 రవాణా పాయింట్లు, 38 మొబైల్‌టీమ్స్ ద్వారా పోలియో చుక్కల మందును పంపిణీ చేయనున్నారు. తొలిరోజు చుక్కలు వేసుకోని వారికి మరుసటి రోజు ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది చుక్కల మందు వేస్తారని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో నవజాత శిశువు స్క్రీనింగ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారులు

నవజాత శిశువులకు హెల్త్ స్క్రీనింగ్

- పుట్టిన 48 గంటల్లో రక్త పరీక్షలు
- అనారోగ్య సమస్యల ముందస్తు గుర్తింపు
- పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 29: నవజాత శిశువుల్లో అనారోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శిశువు పుట్టిన 48 గంటల అనంతరం రక్తనమూనాలు సేకరించి రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించే 'నవజాత శిశువుల స్క్రీనింగ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. సంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈమేరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఇబ్రహీం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన 811 మందిలో ఒకరికి హైపోథైరాయిడిజం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. 2,009 మందిలో ఒకరికి అడ్రినల్ హైపర్‌ప్లాసియా, 1,475 మందిలో ఒకరికి బయాటిన్‌డేజ్ లోపం, 1,340 మందిలో ఒకరికి గాలెక్టోసీమియా వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వాటిని ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో నవజాత శిశువుల నుంచి రక్త నమూనాలు సేకరించి రోగ నిర్ధారణకు పంపనున్నట్లు తెలిపారు. ప్రధానంగా నవజాత శిశువులకు చేసే ఐదు రకాల పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ పరీక్షలు ప్రైవేటులో దాదాపు రూ.10వేలు ఖర్చవుతుందని, జీజీహెచ్‌లో ఈ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్య సమస్యలుంటే ఉచితంగా చికిత్స కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలువురు నవజాత శిశువుల రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శశాంక్, పలు విభాగాధిపతులు షబ్బీర్, రాధిక, ఆర్‌ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా ఆశలు

నిరుద్యోగుల నిరీక్షణకు తెర

- మెగా డీఎస్సీ ప్రకటనపై హర్షం
- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- ఆన్‌లైన్‌లోనే పరీక్ష



సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 29: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన ప్రభుత్వం.. కొత్త దరఖాస్తులను మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొంటూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

ఏడేళ్ల అనంతరం

ఏడేళ్ల అనంతరం ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభించడంతో బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 2017లో టీఆర్‌టీ నిర్వహించారు. అనంతరం మళ్లీ నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొన్నది. గతేడాది సెప్టెంబరులో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. కానీ కోర్టు కేసుతో ఆ ప్రక్రియ నిలిచిపోవడంతో.. కొత్త నియామకాలకు అడ్డంకిగా మారింది. ఇంతలోనే ఎన్నికలు రావడంతో ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. హామీ అమలులో భాగంగా సర్కార్ మెగా డీఎస్సీ ప్రకటన చేసింది.

సంగారెడ్డి జిల్లాలో 551 ఖాళీలు

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో 551 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అందులో స్కూల్ అసిస్టెంట్ 92, ల్యాంగ్వేజ్ పండిట్ 24, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 6, ఎస్జీటీలు 385, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్స్ 9, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్స్ 35 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇవేకాకుండా గెజిటెడ్ హెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులు 65 ఖాళీగా ఉన్నా.. వీటిని పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు.

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 1,247 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 1.25 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం కలగడంతో పాటు విద్యాశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పాటు పలు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో ఈ ఏడాది కూడా సుమారు 155 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల నుంచి లేని చోటకు తాత్కాలిక సర్దుబాటు చేశారు. జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ 47 ఉండగా, వీటిలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా సమీప పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు. మెగా డీఎస్సీ ఖాళీల భర్తీతో ఉపాధ్యాయుల కొరత పూర్తిగా తీరనుంది.

మెదక్ జిల్లాలో 310 ఖాళీలు

తాజా డీఎస్సీలో మెదక్ జిల్లాలో 101 పోస్టులు పెరిగాయి. గత ప్రభుత్వ హయంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాలో 209 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటి కోసం వేలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. తాజా నోటిఫికేషన్‌లో జిల్లాలో జిల్లా 310 ఖాళీలను పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లు 92, ఎస్జీటీలు, భాషాపండితులు 30, వ్యాయామ ఉపాధ్యాయులు 1, సెకండరీ గ్రేడ్ టీచర్ 156 కలిపి మొత్తం 279 ఖాళీలు పేర్కొన్నారు. అదనంగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 31 ప్రభుత్వం ఈసారి కొత్తగా మంజూరు చేసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్‌లు 9, సెకండరీ గ్రేడ్ టీచర్ల 22 ఉన్నాయి. మెగా డీఎస్సీ ద్వారా మొత్తం 310 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది.



కోచింగ్ సెంటర్‌లో అభ్యర్థులు (ఫైల్)



చాలా సంతోషంగా ఉంది

డీఎస్సీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా. ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీని విడుదల చేయడంతో పాటు పోస్టుల సంఖ్యను పెంచినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ ప్రకటనతో నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. ఇచ్చిన మాట మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

-జీవన్, డీఎస్సీ అభ్యర్థి, మెదక్



కల్యాణ వైభోగం

హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కుమార్తె త్రిష దామోదర్ వివాహం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

'గృహజ్యోతి' షురూ..

- నేటి నుంచి జీరో బిల్లు
- ఉచిత విద్యుత్‌పై ఉత్తర్వులు విడుదల
- తెల్లరేషన్ కార్డుదారులకు 200 యూనిట్లు ఫ్రీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 29 : రాష్ట్ర సర్కార్ ఉచిత విద్యుత్ సరఫరాకు రూపొందించిన గృహజ్యోతి పథకంపై ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. వెంటనే అధికారులు మార్గదర్శకాలను వెలువరించారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి నెలకు 200 యూనిట్లు వినియోగించే విద్యుత్ కనెక్షన్లకు ఉచిత కరెంట్ వర్తించనుంది. శుక్రవారం నుంచి జీరో బిల్లు జారీ చేయనున్నారు. ఫిబ్రవరి నెలలో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి మార్చి నెల నుంచి అర్హులకు జీరో బిల్లు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లక్ష మందికిపైగా ప్రయోజనం

ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయనున్నారు. 15 రోజుల పాటు సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, మీటర్ నంబర్‌ను నమోదు చేసుకున్నారు. వీటిని ఎస్‌సీడీసీఎల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా జిల్లాలో 1.08లక్షలపైగా మంది అర్హులున్నట్లు అధికారులు జాబితా సిద్ధం చేశారు. వారికి నేటి నుంచి జీరో బిల్లు రానుంది. ఇందులో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వినియోగదారులకు గృహజ్యోతి అమలు కానుంది. ఈ డబ్బును ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లిస్తుంది.

గృహేతరానికి వినియోగిస్తే చర్యలు

గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్‌ను గృహేతర ప్రయోజనాలకు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. పథకంలో అర్హులైన వినియోగదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యుత్ చట్టం-2003 ద్వారా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.


పరిమితి లోపు వినియోగిస్తేనే

మెదక్ జిల్లాలో 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగించేవారు 1.08 లక్షలకు పైగా ఉన్నారు. అర్హులుగా గుర్తించిన వారు 200 లోపు యూనిట్లు వినియోగిస్తే బిల్లు తీసే సిబ్బంది వారికి జీరో బిల్లు ఇస్తారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుంది.

- జానకీరాములు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, మెదక్

నేటి నుంచి జీరో బిల్లులిస్తాం : విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29 : గృహజ్యోతి పథకం అమలులో భాగంగా ఈ నెలలో 200 యూనిట్లు విద్యుత్‌ను వినియోగించిన అర్హులకు జీరో విద్యుత్ బిల్లు ఇవ్వనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనాథ్ తెలిపారు. సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీరో బిల్లు అందని అర్హులు పథకం లబ్ధిపొందేందుకు కావాల్సిన పత్రాలను మండల కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన అధికారులకు సమర్పించి పథకాన్ని పొందవచ్చన్నారు. ఆయా కార్యాలయాల్లో సమర్పించిన నమోదు రశీదులను విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో సమర్పించినట్లయితే బిల్లును సవరించి ఇస్తారని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనాథ్ కోరారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



TSSPDCL
గృహ జ్యోతి
'0' బిల్లు

తేదీ: 27/02/2024	సమయం : 08:21
బిల్లు నెం.:97143	MRID : 51566
ఇ.ఆర్.ఓ.: అజాముబాద్	
సెక్షన్: శంకర్మట్	
SC No. V4009237	
USC No. 101085773	
పేరు: వి లక్ష్మి	
చిరునామా: 1-8-1/A/58, బాగ్‌లింగంపల్లి	
వినియోగ గ్రూపు: 1B(i) ఇంటికి	Ph:1
ఒప్పందిత లోడ్	1.00 KW
మీటర్ నెం. 10535720	MF:1.0

	తేదీ	స్టేటస్	రీడింగ్ (KWH)
ప్రస్తుత	27-02-2024	1	5123
గత	03-02-2024	1	5014

వాడుకున్న యూనిట్లు : 109	రోజులు: 24
మీటర్ లో నమోదైన లోడ్	1.00 KW
విద్యుత్ చార్జీలు	407.00
స్థిర చార్జీలు	10.00
వినియోగదారుడి చార్జీలు	90.00
విద్యుత్ డ్యూటీ	6.54
విద్యుత్ డ్యూటీ పై వడ్డీ	0.00
అదనపు చార్జీలు	0.00
ఎఫ్.యెస్.ఎ./ఎఫ్.సి.ఎ. చార్జీలు	0.00
సర్దుబాటు	0.00
వినియోగ జమ పై వడ్డీ	0.00
లాభం:నష్టం	0.46
మొత్తం బిల్లు	514.00
గృహ జ్యోతి సబ్సిడీ	-514.00
నికర బిల్లు	0.00
బకాయిలు:	
31-03-2023 రోజున బకాయి	0
01-04-2023 తర్వాత బకాయి	0
మొత్తం బకాయి	0.00
AAO Mobile No.	9440813849
ADE Mobile No.	9440812991

జీరో విద్యుత్ బిల్లు నమూనా

పాతిక శాతం పెండింగ్..!

మెదక్ జిల్లాలో రేషన్‌కార్డుల ఈ-కేవైసీ 74.6 శాతమే..

- జిల్లాలో 2,13,869 మంది లబ్ధిదారులు
- ఇంకా పెండింగ్‌లో 55,869 కుటుంబాలు
- ముగిసిన గడువు

మెదక్, ఫిబ్రవరి 29: రేషన్‌కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ మెదక్ జిల్లాలో లక్ష్యానికి దూరంగానే మిగిలిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన గడువు గురువారం అర్ధరాత్రితో ముగిసినా ఇంకా పాతిక శాతం మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. రేషన్‌కార్డుల్లో అవకతవకలను వెలికితీయడం, అర్హులైనవారికి పారదర్శకంగా సరుకులు సరఫరా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రేషన్‌కార్డులో పేరున్న లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకోవాలని ఆదేశించింది. ఐదు నెలల క్రితం ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఫిబ్రవరి 29 వరకు గడువు విధించింది. ప్రభుత్వ ఆదేశాలమేరకు రేషన్‌కార్డుదారుడితో పాటు కార్డులో పేర్లున్న సభ్యులందరూ ఈ-పాస్ మిషన్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించింది. తద్వారా రేషన్ కార్డుల వెరిఫికేషన్ జరిపే వీలుంటుంది. రేషన్‌కార్డులు కలిగిన వినియోగదారుల్లో కుటుంబ యజమానులు మరణించడం, ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిగి అత్తవారిళ్లకు వెళ్లిపోవడం, మగ పిల్లలు వివాహాలు చేసుకుని ఉమ్మడి కుటుంబం నుంచి విడివడడం వంటివి జరుగుతుంటాయి. అయితే కుటుంబ సభ్యులు తక్కువైనా కార్డు అప్‌డేట్ చేయకపోవడంతో పాత వివరాల మేరకు సరుకులు పొందుతున్నారు. దీంతో అనర్హులు, మృతుల పేర్లను తొలగించడం, రేషన్‌కార్డులో వివరాలను నిర్ధారించుకోవడం కోసం కార్డుదారులందరూ ఈ-కేవైసీ చేయించుకోవడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతీ లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకోవాలని, చేసుకోనివారి పేర్లపై రేషన్ సరుకులను నిలిపివేస్తామని అధికారులు ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు.

పొడిగించినా స్పందన కరువు

రేషన్‌కార్డులకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేయడానికి ప్రభుత్వం తొలుత జనవరి 31 వరకు తుది గడువుగా నిర్ణయించింది. కానీ, పలు కారణాలతో ఈ-కేవైసీ ప్రక్రియ అలస్యం కావడంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు పొడిగించింది. గురువారంతో పొడిగించిన గడువు కూడా ముగిసింది. ఇప్పటివరకూ మెదక్ జిల్లావ్యాప్తంగా 74.66 శాతం మంది రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. జిల్లాలో 2,13,869 రైషన్ కార్డుదారులున్నారు. గడవు లోపు 1.58 లక్షల మంది మాత్రమే ఈ-కేవైసీ నమోదు చేసుకున్నారు. మిగిలిన 55,869 మంది ఈ-కేవైసీ చేయించుకోలేదని జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు తెలిపారు.



మెదక్‌లో ఓ రేషన్‌షాపులో ఈ-కేవైసీ నమోదు చేస్తున్న డీలర్

ధరణి సమస్యల పరిష్కారానికి మూడు బృందాలు

- నేటి నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్
- జిల్లాలో పెండింగ్‌లో 5,833 దరఖాస్తులు

మెదక్, ఫిబ్రవరి 29: మెదక్ జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి నేటి నుంచి 9వ తేదీ వరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆయన రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ధరణి, భూసమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో మూడు బృందాలను నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 5,833 దరఖాస్తులను మండల కార్యాలయాలకు పంపిస్తామని వివరించారు. గతంలో ధరణికి సంబంధించిన ప్రతీ దరఖాస్తు కలెక్టర్ ద్వారా మాత్రమే పరిష్కరించేవారు. ప్రస్తుతం రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్ పరిధిలో కొన్ని సమస్యలు పరిష్కరించేలా అవకాశం కల్పించినట్లు తెలిపారు.

అధికారాల బదలాయింపు

నాలుగు రకాల అధికారాలను జిల్లాస్థాయి నుంచి తహసీల్దార్లకు బదలాయించినట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పట్టాదారు చనిపోతే భూములను వారసులకు బదలాయించడం, పట్టాదారు పేరును సరిచేయడం, ఆధార్ నంబర్, స్త్రీ, పురుషుల పేరు తప్పులు సరిచేయడం, అసైన్డ్ డేటా, డిజిటల్ సంతకం, పాస్‌బుక్‌లో ఫొటో సరిచేయడం, తండ్రి పేరు, భర్త పేరులో తప్పులను సరిద్దిడం ఇక నుంచి తహసీల్దార్ స్థాయిలో ఉంటాయని అదనపు కలెక్టర్ వివరించారు.

ఆర్డీవో స్థాయిలో..

గతంలో పాస్‌బుక్ లేకుండా నాన్‌అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్‌కు జిల్లా కలెక్టర్ స్థాయిలోనే అధికారాలు ఉండేవని, ప్రస్తుతం ఆర్డీవోకు అధికారాలు కల్పించినట్లు వెంకటేశ్వర్లు వివరించారు. ప్రజావాణిలో భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులపైనా ఆర్డీవో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ప్రవాస భారతీయులు గతంలో పాస్‌పోర్ట్ ఆధారంగా మీసేవలో దరఖాస్తు చేసుకుంటే పాస్‌బుక్ వచ్చేదని, ప్రస్తుతం ఆ అధికారం ఆర్డీవోలోకు వర్తిస్తుందన్నారు. తగాదాలు ఉన్న భూమిని కోర్టు ఆర్డర్ ప్రకారం బ్లాక్‌లిస్టులో పెట్టే అధికారం ఆర్డీవోకు ఉంటుందన్నారు. టీఎం-33 అప్లికేషన్లు రూ. 5 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకూ కలెక్టర్ పరిశీలిస్తారని వివరించారు. రూ. 50 లక్షల నుంచి ఆపైన ఉన్న భూ సమస్యలు సీసీఎల్ఏ పరిశీలనకు వెళ్తుందని పేర్కొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో ఈ బృందాలు పనిచేస్తాయని తెలియజేశారు. సర్వేయర్, గిర్దావార్, లీగల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి అదనపు వ్యవసాయ అధికారి ఈ బృందాల్లో సభ్యులుగా ఉంటారని వివరించారు.



సంగారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 16,859 మందికి 16,457 మంది హాజరుకాగా, 402 మంది గైర్హాజరయ్యారు. 97.62 హాజరు శాతం నమోదైంది. కాగా సంగారెడ్డిలోని ఎస్‌వీ, సెయింట్ ఆంథోనీస్, రాయల్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తనిఖీ చేశారు.

మెదక్ జిల్లాలో 254 మంది గైర్హాజరు

మెదక్ జిల్లాలో 30 పరీక్ష కేంద్రాల్లో సెకండియర్ పరీక్షలకు తొలిరోజు 254 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 5,958 పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 5,704 మంది హాజరయ్యారు. కొల్చారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అలాగే, జిల్లావ్యాప్తంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలు సెంటర్లను తనిఖీ చేశాయి. జిల్లాలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

ఉచిత శిక్షణ.. మహిళలకు ఆర్థిక రక్షణ

- ఎన్ఏసీ సహకారంతో ఉచిత కుట్టుశిక్షణ
- బ్యాచ్‌కు 30 మంది చొప్పున మూడునెలల పాటు..

చిన్నకోడూరు, ఫిబ్రవరి 29: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) సంస్థ సహకారంతో చిన్నకోడూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన శిక్షణ కేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన (కుటుంబసభ్యులకు లేబర్ కార్డు ఉన్న యువతులు, మహిళలకు) యువతులు, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తూ ఉపాధికి బాటలు వేస్తున్నది. అనుభవజ్ఞులైన శిక్షకులతో ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్నవాటిపై తర్ఫీదు ఇస్తూ మహిళలు, యువతులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారు. బ్లౌజ్‌లు, ఫ్రాక్స్, గౌనులు, లాంగ్ ఫ్రాక్స్, పంజాబ్ డ్రెస్ వంటి సుమారు 30 రకాల వెరైటీలు కుట్టడంపై శిక్షణ ఇస్తున్నారు.

ఉచితంగా కుట్టు మిషన్

ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే మొదటి బ్యాచ్ పూర్తికాగా.. రెండో బ్యాచ్‌కు కుట్టు మిషన్ శిక్షణ కొనసాగుతున్నది. శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు, మహిళలకు సర్టిఫికేట్‌తో పాటు, కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలు, యువతులు ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందుతున్నారు.



ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు

శిక్షణ చాలా బాగుంది

నేను ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చి కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ చాలా మోడల్స్ నేర్పుతున్నారు. నేర్చుకునేటప్పుడు సందేహాలు వస్తే ట్రైనర్‌ను అడిగితే వెంటనే నివృత్తి చేస్తున్నారు. శిక్షణ తర్వాత ఇంటి దగ్గర టైలరింగ్ ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. శిక్షణ చాలా బాగుంది.

\- కట్కూరి కవిత, రాముని పట్ల

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఏసీ సహకారంతో యువతులకు, మహిళలకు బ్యాచ్‌కు 30 మంది చొప్పున 3 నెలల పాటు కుట్టు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌తో పాటు, కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తున్నాం. యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

\- బి.రజిత, మాస్టర్ ట్రైనర్

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమొద్దు

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

కొండాపూర్, ఫిబ్రవరి 27: సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని, సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి బ్యాంకు అకౌంట్, ఓటీపీ వంటి వివరాలు అడిగితే చెప్పకూడదని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. గురువారం కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రయ్య ఏర్పాటు చేసిన సైబర్ క్రైం నేరాలపై ప్రజా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్పీ హాజరై మాట్లాడారు. ఈ మధ్య సైబర్ నేరగాళ్లు ఫేక్ కాల్స్ చేసి అకౌంట్ వివరాలు అడుగుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ మోసం జరిగితే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. చిన్న పిల్లల దొంగలంటూ యూట్యూబ్, వాట్సాప్ గ్రూపుల్లో ఫేక్ వీడియోలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ క్రమంలో సందర్శనకు వచ్చే యాత్రికులపై అనుమానం వచ్చి దాడులకు దిగడం సరైంది కాదన్నారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఒక్క చిన్న పిల్ల కూడా అపహరణకు గురికాలేదని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాలించాలని సూచించారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ ఈనెల 9న సంగారెడ్డి జిల్లా కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా అవగహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్




జహీరాబాద్‌లోని రైతుల వెంట ఉంటూ పొలాల్లో పనులు చేస్తున్న విద్యార్థినులు

సాగుబాటతో జ్ఞానాన్ని ఒడిసి పడుతూ..

● వ్యవసాయ సాగులో మెళకువలు నేర్చుకుంటున్న విద్యార్థినులు ● జహీరాబాద్ వేదికగా క్షేత్రస్థాయి సందర్శనలు



రంజోల్ గ్రామంలో భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమంలో భాగంగా చిత్రాన్ని (మ్యాప్) వేస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్, ఫిబ్రవరి 29: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు వచ్చి సాగుబాట పట్టి.. జ్ఞానాన్ని ఒడిసి పడుతున్నారు. 'గ్రామీణ ఉద్యాన పని- అనుభవ శిక్షణ'లో భాగంగా ప్రతియేటా జనవరి మొదలుకుని ఏప్రిల్ వరకు క్షేత్రస్థాయి సందర్శనకు ఆయా ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థినులను యాజమాన్యాలు పంపిస్తుంటాయి. రైతుల వద్ద పంటల సాగు విధానాన్ని నేర్చుకుని పరీక్షలకు సిద్ధమయ్యేలా చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం లాగే.. ఈ సంవత్సరం కూడా 30 మంది విద్యార్థినులు శిక్షణ నిమిత్తం వచ్చారు. ప్రస్తుతం వారు రంజోల్, చిన్న హైదరాబాద్‌లో ఉంటూ రైతుల వద్ద అనుభవాలను నేర్చుకుంటున్నారు. స్థానికంగా ఉండే అధికారులు ఉద్యాన పంటలను సాగుచేసే ఒక్కో రైతుకు, ఒక్కో విద్యార్థిని అటాచ్ చేశారు. ఆయా విద్యార్థిని మూడునెలల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులతో ఉంటూ సాగు పద్ధతులను అవగతం చేసుకోవాల్సి ఉంటుంది. పంటల సాగులో విత్తనాలు నాటే మొదలుకుని పంట చేతికొచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాన్ని రైతుల వెంటే ఉండి నేర్చుకుంటున్నారు. రసాయనాలు, సేంద్రియ ఎరువుల వాడకం, పంటలపై రసాయనాలను పిచికారీ చేసే విధానం, పంటల దిగుబడి, ఏయే సమయాల్లో కలుపు మొక్కలు తీయాలి, పంట చేతికి ఎప్పుడు వస్తుందనే వివరాలను రైతుల ద్వారా నివృత్తి చేసుకుంటున్నారు.

ఉద్యాన విద్యార్థులకు శిక్షణ కేంద్రం జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో ఉద్యాన పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న నేపథ్యంలో జహీరాబాద్ విద్యార్థులకు శిక్షణ కేంద్రంగా మారింది. ఉద్యాన పంటలతో పాటు రైతులు అదనంగా జెరీనీయం, అంజీర్, యాపిల్, డ్రాగన్‌ఫ్రూట్, చియా(సబ్జగింజలు) తదితర కొత్తరకం పంటలను సాగుచేస్తున్నారు. వీటితో పాటు అరటి, బొప్పాయి, మామిడి, జామ, సపోట, యాపిల్, అల్లం, ఉల్లిగడ్డను సాగుచేస్తున్నారు. కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల్లో 20వేల పైచిలుకు ఎకరాల్లో రైతులు ఉద్యాన పంట(పండ్ల తోటలు, కూరగాయ)లను సాగుచేస్తున్నారు. అందులో 13 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, 7వేల పైచిలుకు ఎకరాల్లో వివిధరకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. రంజోల్, హుగ్గెల్లి, చిన్నహైదరాబాద్, హోతి(బి), కాశీంపూర్, రాయిపల్లితండా, మొగుడంపల్లి, ధనసిరి, గోపన్‌పల్లి, పర్వతాపూర్, కవేలి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, పిచేర్యాగడి, మనియార్‌పల్లి, ఈదులపల్లి గ్రామాల వ్యవసాయ భూములు ఉద్యాన పంటల సాగుకు యోగ్యమైనవి. గ్రామానికి చెందిన కొందరు రైతులు వివిధ ప్రాంతాలకు వెళ్లి కొత్త రకం వంగడాలను తీసుకొచ్చి అధికారుల, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆయారకాల పంటలను సాగు చేస్తున్నారు.



క్షేత్రస్థాయితోనే మరింత అర్థమవుతున్నది

తాము కళాశాలల్లో నేర్చుకున్న దానికంటే క్షేత్రస్థాయిలో చూసి ఎంతగానో నేర్చుకుంటున్నాం. పంటల సాగు, దిగుబడి, సస్యరక్షణ విధానం, రైతులతో అనుభవాలను పంచుకోవడం తమకు సంతృప్తినిస్తున్నది. స్థానికంగా ఉన్న వ్యవసాయ భూములన్నీ ఉద్యాన పంటలకు అనుకూలమైనవి కావడంతో తమ విద్యాబోధనకు ఉపయోగపడుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సహకారంతో ఉద్యాన పంటలను సాగుచేసే రైతుల వెంట పొలాలకు వెళ్లి కొత్త రకం సాగుతీరును చూస్తున్నాం. ఈ శిక్షణ జీవింతాతం గుర్తుండి పోయేలా ఉన్నది. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వెన్నంటి ఉంటూ తమకు మరింత సహకరిస్తున్నారు.

- సంకీర్తన విద్యార్థిని, కరీంనగర్



రైతులతో కలిసి నేర్చుకోవడం సంతృప్తిగా ఉన్నది

రైతులతో కలిసి వారివెంట పొలాలకు వెళ్లి నేర్చుకోవడం తమకు ఎంతగానో సంతృప్తినిస్తున్నది. ముఖ్యంగా రైతులే నిత్యం కొత్త రకం శాస్త్రవేత్తలని ఆమె అభివర్ణించారు. వారి వద్ద అపారమైన అనుభవాలను తాము ఒంట బట్టించుకుని మరింత నేర్చుకుంటున్నాం. క్షేత్రస్థాయి సందర్శన ఉపయోగకరంగా మారి మంచి సత్ఫలితాలనిస్తున్నది. పండ్ల తోటలకు జహీరాబాద్ నియోజకవర్గం ఎంతగానో ప్రసిద్ధి చెందుతున్నది. ముందుముందు ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు రెట్టింపు స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నది.

- సుప్రజ, విద్యార్థిని, నిజామాబాద్



విద్యార్థులకు గైడ్‌లా మారి సలహాలిస్తున్నాం

విదార్థులకు గైడ్‌లా మారి తోచినస్థాయిలో సలహాలు, సూచనలు ఇస్తున్నం. ఇలాంటి అవకాశం కొందరికి మాత్రమే వస్తున్నది. విద్యార్థుల ద్వారా కొత్త పద్ధతులను నేర్చుకుంటున్నాం. జహీరాబాద్ ప్రాంతంలో ఉద్యాన పంటలను ఎక్కువగా సాగుచేయడం వల్లే విద్యార్థులను క్షేత్రస్థాయి అధ్యయనం నిమిత్తం పంపిస్తున్నారు. కొత్తరకం పంటలను సైతం రైతులు సాగుచేస్తున్న తీరు విద్యార్థులకు ఉపయోగకరంగా మారింది. గతేడాది ఓబ్యాచ్ వచ్చి నేర్చుకుని వెళ్లారు. ఈఏడాది మరోబ్యాచ్ వచ్చింది. వారందరినీ రైతులకు అటాచ్ చేశాం.

- ప్రదీప్, వ్యవసాయ విస్తీర్ణాధికారి, జహీరాబాద్

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

● మారుతున్న డిజైన్లతో పెరుగుతున్న భారం
● జిల్లా కేంద్రంలో వెక్కిరిస్తున్న అసంపూర్తి నిర్మాణాలు



పిల్లర్ల స్థాయిలోనే వదిలేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29: మెదక్ జిల్లా కేంద్రంలో దశాబ్ద కాలం తర్వాత ప్రారంభించిన రాందాస్ చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నిధుల లేమీతో పాటు మారుతున్న డిజైన్ల కారణంగా అసంపూర్తిగానే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏప్రిల్‌లో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చేతులమీదుగా రెండు పనులకు భూమి పూజ చేశారు. అప్పట్లో కొంత పనులు జరిగినా.. ఆరు నెలల నుంచి ముందుకు సాగడం లేదు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికిగాను రూ.3 కోట్ల అంచనా వేయగా ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన నిధులు వినియోగించుకునేందుకు ప్రణాళికలు చేశారు. అంతేగాకుండా కాంట్రిబ్యూషన్, పట్టణ ప్రగతి నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ పనులు చేపట్టేందుకు పాలకమండలి నిర్ణయించింది. ప్రస్తుతం సెల్లార్ లెవల్ వరకు పనులు చేయగా ఇప్పటివరకు రూ.38 లక్షలను కాంట్రాక్టర్‌కు చెల్లించారు. అంచనాలకు మించి సెల్లార్ తవ్వకం జరగడం, స్థల వినియోగంలో మార్పులు రావడంతో కొత్తగా డిజైన్లు రూపొందించారు. కానీ అనుమతి రాకపోవడంతో ఆ పనులు కాస్తా నిలిచిపోయాయి. ఇదేకాకుండా మరో రూ.30 లక్షలు కాంట్రాక్టర్‌కు రావాలని తెలుపుతుండగా... నిధులు విడుదల చేయడం లేదని తెలిసింది. ఓ వైపు నిధులు, మరోవైపు డిజైన్స్ అనుమతి లభిస్తే కానీ పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. డిజైన్స్ అనుమతి లభిస్తే నిర్మాణ వ్యయభారం మరో రూ.2 కోట్లు పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ది అదే పరిస్థితి

జిల్లా కేంద్రంలో రెండు, మూడు స్థలాల పరిశీలన అనంతరం ఆర్డీవో కార్యాలయం వెనక రూ.6 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. ప్రస్తుతానికి భూ స్థాయిలో బెడ్ వేసి పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు రూ.70 లక్షల పనులకు రికార్డింగ్ పూర్తి అయినా ఇప్పటివరకు నిధులు రాలేదని కాంట్రాక్టర్ తెలిపారు. ఇక్కడా భూ పరిస్థితులను బట్టి డిజైన్స్ మారడంతో నిర్మాణం వ్యయం రూ.8 కోట్లకు పెరిగే అవకాశమున్నదని తెలిసింది. నిధులు విడుదల కానిదే పనులు ఎలా చేస్తామని ప్రశ్నిస్తున్నారు.

అనుమతులు కోసం కృషి చేయాలి

మున్సిపల్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణమైన డివేయేషన్ డిజైన్స్ అనుమతులు తీసుకురావడంలో ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు కృషిచేయాల్సి ఉన్నది. ఆరునెలలుగా పనులు నిలిచిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి అనుమతులతో పాటు కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేసే విషయంలో కృషిచేస్తే అభివృద్ధి పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉన్నది.



రాందాస్ చౌరస్తాలో సెల్లార్ వద్ద నిలిచిపోయిన మున్సిపల్ కాంప్లెక్స్ పనులు

నిధులు విడుదల కావడం లేదు

మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు సంబంధించిన రూ.30 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉన్నది. నిధుల లేమి కారణంగా డబ్బులు చెల్లించలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభమైనా నిధుల కేటాయింపులో అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు ఇంకా స్పష్టతనివ్వలేదు. దీంతో ఈ పనులు కూడా నిలిచిపోయినట్లు వివరించారు. ఈ రెండు నిర్మాణాల్లో మార్పులు ఉన్నందున తిరిగి అనుమతులు పొందాల్సిన అవసరం ఉన్నది.

- మహేష్, డీఈ

నిజాంపేటలో దొంగల హల్‌చల్

● తాళం వేసిన మూడిళ్లలో చోరీ
● రూ.20 వేలు, 27 తులాల వెండి, తులంన్నర బంగారం అపహరణ



చోరీ చేసిన ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

నిజాంపేట, ఫిబ్రవరి 29: నిజాంపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన వప్పుల కిష్టారెడ్డి, కుమ్మరి బాలరాజు ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలు, సూట్‌కేసులను ధ్వంసం చేసి, వస్తువులను చిందరవందరగా పడేశారు. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి ఇంటి యజమానులకు చెప్పారు. వారు వచ్చి చూడగా తాళాలు ధ్వంసమై ఉన్నాయి. అలాగే ఒంటరిగా నివసిస్తున్న బత్తుల శివవ్వ మూడురోజులుగా చిన్న కుమారుడు అర్జున్ ఇంటికి వెళ్తున్నది. బుధవారం రాత్రి 8 గంటలకు తాళం వేసి వెళ్లి.. ఉదయం 5 గంటలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా టిఫిన్ డబ్బాలో దాచిన వెండి ఆభరణాలు, కొంత నగదును దొంగిలించారని తెలిసింది. పై మూడు ఘటనలలో కలిపి రూ.20 వేల నగదు, అర తులం బంగారం, 27 తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్టు

● 22న జరిగిన చోరీలో 7.5 తులాల నగలు స్వాధీనం
● తూప్రాన్ డీఎస్పీ సామ వెంకట్‌రెడ్డి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 29: తూప్రాన్ పట్టణంలో పట్టపగలు బంగారం చోరీకి పాల్పడిన పాత నేరస్థుడిని గురువారం రాత్రి పట్టుకుని, అతడి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ సామ వెంకటొరెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ హమీద్ అలియాస్ హైమద్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 84 చోరీలకు పాల్పడ్డాడు. గతంలో చేసిన చోరీల్లో 2022లో హమీద్‌ను అరెస్టు చేయగా, డిసెంబరులో విడుదలయ్యాడు. కొంత కాలం చోరీలకు దూరంగా ఉండి పండ్ల వ్యాపారం, ఆటోడ్రైవర్‌గా పనిచేశాడు. ఈనెల 22న తూప్రాన్ పట్టణంలోని ప్రైవేటు క్లర్క్ ఉద్యోగం చేస్తున్న ఉమారాణి ఇంట్లో పట్టపగలు ఇంటి తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీ చేశాడు. బంగారం అమ్మకం చేసేందుకు గురువారం నిజామాబాద్ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు చోరీ చేసిన బంగారం నుంచి తులం అమ్మకం చేసి ఖర్చు చేయగా, 7.50 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు హమీద్ 1996 నుంచి వరంగల్‌లో చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇప్పటి వరకు 84 చోరీలు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ రొడ్డ బోయిన కృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.

సాంబారుతో సరి!

● మధ్యాహ్న భోజనంలో విద్యార్థులు పస్తులు



సాంబారుతో అన్నం వడ్డిస్తున్న తోటి విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. అక్షయపాత్ర అంటే రుచికరమైన పౌష్టికాహారం, కూరగాయలు, పండ్లతో వడ్డించారు. కానీ సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో గురువారం విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా కేవలం సాంబారుతో కూడిన అన్నాన్ని పంపిణీ చేశారు. కేవలం సాంబారుతో భోజనం మింగుడుపడని విద్యార్థులు వంటలు బాగాలేవని ఉపాధ్యాయులకు చెప్పలేక చేసేది లేక సగం గడుపుకే తిని పస్తులుంటున్నారు. కనీసం సాంబారుతో పాటు ఒక రకం కూరగాయలతో భోజనం వడ్డిస్తే బాగుంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

తడి, పొడి చెత్తతో ఆదాయం

● సాహస్ స్వచ్ఛంద సంస్థ పనితీరు భేష్
● రూరల్ మండలంలోని గ్రామాలు స్వచ్ఛతకు నిదర్శనం
● జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి



పొడి చెత్త కట్టింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 29: సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామాలు స్వచ్ఛతకు ఆదర్శంగా నిలిచాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అభినందించారు. సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంవత్సర కాలంగా తడి, పొడి చెత్త వేరుచేసి ఇచ్చే పద్ధతిపై సంస్థ కల్పించిన అవగాహన విధానం బేష్ అంటూ కితాబిచ్చారు. తడి చెత్త భూమిలో త్వరగా కలిసిపోవడంతో పాటు పంటకు అవసరమైన ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కానీ పొడి చెత్త భూమిలో కరిగిపోకపోవడంతో పాటు దుష్ప్రభావాలను కలిగిస్తున్నదని చెప్పారు. అందుకే సాహస్ స్వచ్ఛంద సంస్థ పొడి చెత్తను వేరు చేసి ఇచ్చే విధానంపై చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సీజీఐ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి శైలేంద్ర మాట్లాడుతూ తడి, పొడి చెత్తవేరు చేసి వినియోగించడంపై, నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం, థర్డ్ జెండర్స్ అభివృద్ధి కోసం, సాగునీటి కాలువల అభివృద్ధి కోసం సీజీఐ పరిశ్రమ పనిచేస్తున్నదన్నారు. సాహస్ స్వచ్ఛంద సంస్థకు నిధులు అందిస్తూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నదని పేర్కొన్నారు. సుడా మాజీ ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇర్కోడ్ గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వడం వల్ల వర్మీ కంపోస్ట్ ఎరువులు ఉత్పత్తి చేయడం, విక్రయించడం వల్ల రైతులకు నాణ్యమైన ఎరువులు అందుతున్నాయని, గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతున్నదని చెప్పారు. భవిష్యత్తులో పొడి చెత్తపై ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఇర్కోడ్ గ్రామంలోని డంపింగ్‌యార్డులో పొడి చెత్తను వేరుచేసి ముక్కలుగా చేసే మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఎంపీటీసీ బాబు, సాహస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ శేఖర్, కోఆర్డినేటర్ ఇటిక్యాల చిన్న, సూపర్‌వైజర్లు, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగంతో ఎంతో ప్రయోజనం

● శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, శైలజ



కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త వరప్రసాద్, తదితరులు

జహీరాబాద్, ఫిబ్రవరి 29: చిరుధాన్యాలను వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, శైలజ పేర్కొన్నారు. అల్గోల్ గ్రామ శివారులోని డీడీఎస్, కేవీకేలో గురువారం పలువురు రైతులకు చిరుధాన్యాల సాగు, వినియోగం, సేంద్రియ ఎరువుల తయారీ, జీవామృతం తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రతియేటా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాల వినియోగం ఎక్కువ మోతాదులో ఉండాలన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా ఉపయోగించడం వల్ల శరీరానికి పోషకాలు అధికంగా లభిస్తాయని చెప్పారు. రైతులు వారి వారి వ్యవసాయ పొలాల్లో చిరుధాన్యాలను ఎక్కువ మొత్తంలో సాగుచేయాలని కోరారు. చిరుధాన్యాలకు మార్కెట్లో మరింత డిమాండ్ ఉన్నదని వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీభగలాముఖి అమ్మవారి వార్షికోత్సవం

● హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు నేతలు



శ్రీభగలాముఖి అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు దంపతులు

శివ్వంపేట, ఫిబ్రవరి 29: మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీభగలాముఖి అమ్మవారి వార్షికోత్సవాలు వైభవంగా సాగాయి. గురువారం శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం సహస్ర పుష్ప, సహిత హరిద్రార్చన మహామంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వరశర్మ, శివకుమార్‌గౌడ్, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, శ్రీనివాస్ గౌడ్, పురుషోత్తంశర్మ, స్వరూపరమేష్‌గుప్తా, సంతోష్‌శర్మ, మాజీ ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్‌యాదవ్, బుచ్చేస్‌యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



గౌరమ్మ మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 29: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన గజ్జెల గౌరమ్మ(45) కుమారుడితో కలిసి జీవిస్తున్నది. కొద్దిరోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం సైతం మళ్లీ గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన గౌరమ్మ ఇంట్లోంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం తూప్రాన్ పెద్దచెరువులో గౌరమ్మ మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

మాసాయిపేట, ఫిబ్రవరి 29: మద్యానికి బానిసైన యువకుడు గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన ప్రభాకర్ జల్సాలకు అలవాటు పడి నిత్యం మద్యం సేవించేవాడు. కాగా గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కాశీరాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరు..



పోచయ్య(ఫైల్)

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 29: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని అజ్జమర్రికి గ్రామానికి చెందిన అతినారం పోచయ్య(42) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతి



నర్సింహులు మృతదేహం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 29: ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ పరశురాములు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దం నర్సింహులు(53) కాలకృత్యాలకు గ్రామ శివారులోని కూడవెల్లి వాగు వద్దకు వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతిచెందాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆస్పత్రికి తరలించారు.

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం

నిజాంపేట, ఫిబ్రవరి 29: కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు చిన్న కూతురు సుమలత(19) రామాయంపేటలోని ఛత్రపతి శివాజీ డిగ్రీ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 29: నారాయణఖేడ్ మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.జగ్జీవన్ కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని, అమ్మకాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. దుకాణాల యజమానులు, ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లే సమయాల్లో ప్రజలు జ్యూట్ బ్యాగులను తీసుకెళ్లాలని సూచించారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు కాకుండా జ్యూట్ బ్యాగుల్లోనే వినియోగదారులకు సరుకులు ఇవ్వాలని సూచించారు. మాంసం కొనుగోళ్లకు ప్రజలు టిఫిన్ బాక్సులను తీసుకెళ్లాలని సూచించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

● సీపీఐ జిల్లా, రాష్ట్ర నాయకుల డిమాండ్
● జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

జహీరాబాద్, ఫిబ్రవరి 29: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా, రాష్ట్ర నాయకులు నర్సింహా, జలాల్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలతో కలిసి జహీరాబాద్ పట్టణంలో రహదారిపై ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకులు ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఏళ్ల తరబడి నిరుపేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అయినా కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల పాలన తీరును సీపీఐ నాయకులు ఎండగట్టారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



వెల్దుర్తిలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో ఎస్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీలను అమలు చేయడంతో పార్టీ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా మేల్లూరు గ్రామ శివారులోని బాలత్రిపురసుందరి దేవి ఆలయంలోని పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, దుర్గగౌడ్, నంబుద్రి, నిరంజన్‌రెడ్డి, శేఖులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ సీఐ బదిలీ

నర్సాపూర్, ఫిబ్రవరి 29: నర్సాపూర్ సీఐగా రంగకృష్ణ నెలరోజుల క్రితమే బదిలీపై రాగా పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ కావాల్సి వచ్చింది. ఆయన స్థానంలో ప్రస్తుతం వెయిటింగులో ఉన్న జాన్‌రెడ్డి నర్సాపూర్ సీఐగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన రంగకృష్ణను మల్టిజోన్-1లో రిపోర్టు చేయాలని ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

శివస్వాముల మహాపడిపూజ

జిన్నారం, ఫిబ్రవరి 29: మండల కేంద్రం జిన్నారంలో శివస్వాముల ఆధ్వర్యంలో మహాపడి పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిర్లింగ శివాలయ సన్నిధానంలో మహాపడిపూజను నిర్వహించారు. శివస్వాములు శంకరయ్య, లక్ష్మణ్, ఫణిభూషణ్, రాజుగౌడ్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించగా.. జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, భారీ సంఖ్యలో శివస్వాములు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఖేడ్‌లో టీ-హబ్ ప్రారంభం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 29: ఖేడ్ ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన టీ-హబ్ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్లసంజీవరెడ్డి ప్రారంభించనున్నారని వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీ-హబ్‌తో మరిన్ని వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఖేడ్ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

PROCLAMATION REQUIRING ATTENDANCE OF DEFENDANT
(ORDER 5, rule 20 of the Code of Civil Procedure)
In the court of
Sh. Naresh Kumar Malhotra District Judge (Commercial-06) West Court No. 403, Extension Block, Tis Hazari Courts, Delhi CS (COMM)/120/2022
Aqualite Industries Pvt. Ltd.
Versus
Mahalaxmi Traders

To,
M/s. Mahalaxmi Traders
Through Its Proprietor Mr. Manoj Kumar Having Its Office At: H.No. 9-4/1, Netaji Nagar, Bandlaguda, Patancheru, Sangareddy, Telangana-502319
Also at : H.No. 14-40/A, Plot No. C2/2, Surabhi Nilayam, Sri Ram Nagar Colony, Patancheru, Sangareddy, Telangana-502319.
WHEREAS you, in view of the reports already received, cannot be served in ordinary way. It is hereby notified that if you shall not defend the case on the **27-03-2024** the day fixed for the final disposal, it will be heard and determined ex-parte.
GIVEN under my hand and the seal of the court on this **19-02-2024.**

Seal Sd/
District Judge (Commercial-06)
West Tis Hazari Courts, Delhi

గుమ్మడిదలలో ఆధార్ కేంద్రం లేక తిప్పలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 29: గుమ్మడిదల మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుమ్మడిదలలో కొనసాగిన ఆధార్ సెంటర్‌ను అర్ధాంతరంగా మూసివేయడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయి. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, నూతన కార్డుల నమోదు కోసం మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మేడ్చల్ జిల్లాలోని గండి మైసమ్మలో ఉన్న ఆధార్ సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. గుమ్మడిదలలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



చేగుంట పాఠశాల విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట, ఫిబ్రవరి 29: చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ముఖ్యమైనవని, పారదర్శకంగా నిర్వహించినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘుపతి, చల్లా లక్ష్మణ్, రమ, రాథోడ్, వెంకటేష్, భవాని, శారద, శ్రీవాణి, లలిత, చక్రధర్ శర్మ, శృతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

నాగల్‌గిద్ద/మనూరు, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని కరస్‌గుత్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ చౌహాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. హోప్ న్యూరో కార్డియాక్ వైద్యశాల చేపట్టిన సేఫ్ హార్ట్ క్యాంపెయినింగ్‌లో భాగంగా లక్ష మందికి అవగాహన కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాజేష్ చౌహాన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావు పాల్గొన్నారు. మనూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గారి సహకారంతో సీపీఆర్‌పై రాజేష్ చౌహాన్ అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నర్సాపూర్‌లో దోబీఘాట్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 29: నర్సాపూర్‌లో రూ.కోటితో చేపట్టిన శ్మశానవాటిక ఆధునీకీకరణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పరిశీలించారు. త్వరలో శ్మశానవాటికను అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే రూ.రెండున్నర కోట్లతో రజకుల కోసం చేపట్టిన దోబీఘాట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ రామచందర్, నాయకులు భిక్షపతి, నగేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సల్లామురళి తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ ఆర్డీవోగా జయచంద్రారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 29: నర్సాపూర్ ఆర్డీవోగా జయచంద్రారెడ్డి బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఆర్డీవోగా పనిచేసిన శ్రీనివాసులు హుజూర్‌నగర్‌కు బదిలీ కాగా అక్కడ పనిచేసిన జయచంద్రారెడ్డి నర్సాపూర్‌కు బదిలీపై వచ్చారు. త్వరలోనే పార్లమెంటు ఎన్నికలు నిర్వహించనున్నందున ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఆర్డీవోలు బదిలీ అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లాలో 30 యాక్ట్ అమలు: ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 29: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని మార్చి 31 వరకు 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ బాలస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

రైతుల కళ్లల్లో ఆనందం చూసేందుకే కాళేశ్వరం నిర్మాణం

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



ఉప్పులింగాపూర్‌లో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: రైతుల కళ్లల్లో ఆనందం చూడాలనే ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజ్‌లను నిర్మించారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఇటీవల ప్రభుత్వం కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన సందర్భంగా గురువారం ఉప్పులింగాపూర్ బ్రిడ్జి వద్ద హల్దీ వాగులో గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులతో ప్రజలకు ఎలాంటి మేలు జరగదని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు కొద్దిపాటు మరమ్మతులు చేయకుండా వర్షాకాలం వరకు కాలయాపన చేసి బ్యారేజ్ పడిపోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమన్నారు. అలాగే మండల పరిధిలోని మేల్లూరు గ్రామ శివారులో ఉన్న బాలత్రిపుర సుందరి దేవి ఆలయంలో పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. ఆమె వెంట జడ్పీటీసీ రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులు కృష్ణగౌడ్, నర్సింహులు, అశోక్, మల్లేశ్, చందు, వెంకటేష్, మైసయ్య తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో జరిగిన అక్రమాలను వెలికితీయాలి

● జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి



ఖేడ్‌లో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

నారాయణఖేడ్/మనూరు, ఫిబ్రవరి 29: కాళేశ్వరం ప్రాజెక్టు వుంగేశ్వరంగా మారిందని, కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అక్రమాలను వెలికి తీయకుండా పాత ముఖ్యమంత్రిని నిందించడంలోనే కొత్త ముఖ్యమంత్రి కాలయాపన చేస్తున్నాడని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. గురువారం నారాయణఖేడ్, మనూరులో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని గత పాలకులు రూ.ఏడు లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు మరో రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేయాల్సి ఉందన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి, ప్రయాణికులను రోడ్లపై నిరీక్షింపజేస్తున్నారని, బస్టాండ్‌లను లీజుకు ఇస్తున్నారని విమర్శించారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని ఒక్క యూనిట్ అధికమైన బిల్లు వసూలు చేస్తామనడం సరికాదన్నారు. గత ప్రభుత్వాల పాలనతో ఆందోల్, నారాయణఖేడ్, కొల్హాపూర్ నియోజకవర్గాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయన్నారు. గత 10 సంవత్సరాలుగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ గ్రామాల్లో పర్యటించక పోవడంతో ఆయనను గుర్తుపట్టే స్థితిలో ప్రజలు లేరన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఎవరైనా అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీజేపీ 70 వేల ఆధిక్యత సాధించడం ఖాయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 5న ప్రధాని మోదీ సంగారెడ్డి పర్యటనను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్, రాష్ట్ర నాయకులు వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, గిరిజన మోర్చా జాతీయ నాయకుడు అమర్‌సింగ్, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

క్రీడా స్థలంలో గ్రంథాలయ నిర్మాణం చేపట్టవద్దు

● వెల్దుర్తి గ్రామస్థుల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వెల్దుర్తి గ్రామస్థులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన క్రీడా మైదానంలో గ్రంథాలయ నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశం, మెదక్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, సీపీఎం మండల కార్యదర్శి గౌరి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు రాకేష్ తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో జగదీశ్వరచారి, పాఠశాల హెచ్ఎం సాంబయ్యకు వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయ భవన నిర్మాణం చేపడితే పాఠశాల విద్యార్థులకు ఆడుకునే స్థలం కరువవుతుందని చెప్పారు. ఈ విషయంపై అధికారులు స్పందించి గ్రంథాలయ నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో శ్రీను, లక్ష్మణ్, అంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, అశోక్‌గౌడ్, నవీన్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

● డీఈఈ లక్ష్మీనారాయణ

జహీరాబాద్, ఫిబ్రవరి 29: జహీరాబాద్ డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో గల 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఝరాసంగంలో ఫీడర్‌సిటీ పాడైనందున మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. రంజోల్, పస్తాపూర్, అల్గోల్, దిగ్వాల్, వెంకటాపూర్, సజ్జాపూర్, మాచునూర్, ఝరాసంగం, ఎల్గోయి, జీర్లపల్లి, చీలపల్లి, రాయికోడ్, కర్చల్, మహబత్‌పూర్, సింగితం, న్యాల్‌కల్, హద్నూర్, డప్పూర్, చాల్కి, మెటల్‌కుంట, మామిడిగి, మిర్జాపూర్, సత్వార్, ధనసిరి, బూచనెల్లి, చిన్నహైదరాబాద్, మల్‌చెల్మ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాలు మారినా పదవులు మాత్రం దంపతులకే

● సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సడాకుల కుమార్ ఎంపిక
● గతంలో చైర్‌పర్సన్‌గా కుమార్ సతీమణి

సదాశివపేట, ఫిబ్రవరి 29: ప్రభుత్వాలు మారినా పదవులు మాత్రం ఆ దంపతులకే దక్కడం గమనార్హం. సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొండాపూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన సడాకుల కుమార్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎంపిక చేశారు. 4న ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇంతకు ముందు బీఆర్ఎస్ హయాంలో కుమార్ సతీమణి కృపాకుమార్ చైర్‌పర్సన్‌గా సేవలందించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమె చైర్‌పర్సన్ హోదాలో భర్తతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. ఇప్పుడు చైర్మన్ పదవి ఓసీ-జనరల్‌కు రిజర్వ్ అయినా కృపాకుమార్ భర్త కుమార్‌నే పదవి వరించడం గమనార్హం.

నేడు మండల సర్వసభ్య సమావేశం

● నాగల్‌గిద్ద ఎంపీడీవో రాజశేఖర్

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 29: నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు నాగల్‌గిద్ద ఎంపీడీవో రాజశేఖర్ గురువారం తెలిపారు. ఎంపీపీ మోతిబాయి రాథోడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

నర్సాపూర్, ఫిబ్రవరి 29: నర్సాపూర్ మండలం నారాయణపూర్ సమీపంలోని గిరిజన బాలికల గురుకులంలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థినులకు బేటి బచావ్, బేటి పడావో సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఏదేని ఆపద సమయంలో సహాయం కోసం వెంటనే ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఫోన్ చేయాలని వివరించారు.

చింతల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇష్టారాజ్యం

● వంతుల వారీగా వైద్య సిబ్బంది హాజరు
● నెల రోజులుగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టని వైనం

హత్నూర, ఫిబ్రవరి 29: మండలంలోని చింతల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. వంతులవారీగా విధులకు హాజరవుతుండడంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడంలేదు. ఆస్పత్రి సిబ్బంది ఫిబ్రవరి నెలకు సంబంధించి కనీసం ఒక్కరోజు కూడా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడం గమనార్హం. ల్యాబ్ టెక్నీషియన్ మూడు రోజులుగా ఆస్పత్రికి రాకపోవడంతో టెస్టుల కోసం వచ్చిన రోగులు వెనుతిరిగి పోతున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి నేత్రావతి సైతం ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారు. గురువారం వైద్యాధికారిణి రాకపోవడంతో సాదుల్లానగర్ సబ్ సెంటర్ వైద్యురాలు రోగులకు పరీక్షలు నిర్వహించారు. కంప్యూటర్ ఆపరేటర్ 11:30గంటలకు తాపీగా హాజరు కావడం కనించింది. ఆస్పత్రిలో ఇద్దరు స్టాఫ్‌నర్సులు ఉండగా ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. స్వీపర్లు ఇద్దరు ఉండగా ఒక్కరే పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా పల్స్ పోలియో డబ్బాలు మరుగుదొడ్లలో కనిపించాయి.



ఆస్పత్రి మరుగుదొడ్డిలో ఉంచిన పల్స్ పోలియో డబ్బాలు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

చింతలచెర్వు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది పని తీరుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారిణి గాయత్రీదేవి తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టని దృశ్యం

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్



సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా రవాణరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆ బోర్డు ద్వారా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పిల్లల చదువులు, వివాహాలకు ఆర్థిక సహాయం అందించేలా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలను నివారించేందుకు వాహన చట్టాన్ని సవరిస్తామనే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎంవీయాక్ట్ 2019ని తీసుకువచ్చి రవాణరంగ కార్మికులను జీవించే పరిస్థితి లేకుండా చేస్తున్నదని విమర్శించారు. ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి చూపాలని లేని పక్షంలో రవాణరంగ కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు బాబురావు, రవాణరంగ యూనియన్ నాయకులు శేఖర్, మాణిక్యం, ప్రవీణ్, ప్రభు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కాంగ్రెస్



మాదారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

జిన్నారం, ఫిబ్రవరి 29: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పార్టీ జిన్నారం మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్ అన్నారు. ఉచిత విద్యుత్, రాయితీపై వంట గ్యాస్ పథకాలను ప్రభుత్వం ప్రారంభించడం హర్షించతగ్గ విషయమని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా గురువారం మాదారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ మండలాధ్యక్షుడు రాజుగౌడ్, ఇతర నాయకులు, కార్యకర్తలతో క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఈ సందర్భంగా వారు చెప్పారు.

ఆధునిక జీవనంలో ధ్యానం భాగం కావాలి



బొల్లారంలో ఉచిత ధ్యాన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి తదితరులు

జిన్నారం, ఫిబ్రవరి 29: ధ్యానం ప్రతి ఒక్కరి జీవనంలో భాగం కావాలని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం బొల్లారం వైఎస్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ధ్యాన కేంద్రాన్ని మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ప్రారంభించారు. ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో శారీరక, ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ధ్యానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కాగా ధ్యాన కేంద్రంలో స్థానికులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు దత్తు, పండరి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య, నాయకులు చక్రపాణి, వెంకటయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 29: హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం టీయూడబ్ల్యూజే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. గ్రామీణ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు సాధించిపెట్టిన ఘనత శ్రీనివాస్‌రెడ్డికే దక్కుతుందన్నారు. శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టులందరికీ మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. శ్రీనివాస్‌రెడ్డిని మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి, సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. మెదక్ జిల్లా జర్నలిస్టులు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డిని గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, దాడుల వ్యతిరేక కమిటీ సభ్యుడు మిన్పూరు శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా హెల్త్ కమిటీ సభ్యులు మెంగర్తి సుధాకర్, నాయకులు సుమన్, సంగమేశ్వర్, నర్సింహులు ఉన్నారు.

ఆధార్ ఓటీపీ నిబంధనను తొలగించాలి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 29: ఈ సంవత్సరం నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆధార్ ఓటీపీ నిబంధనను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎన్‌టీఏ బ్రౌజర్‌లో నమోదు చేసుకునేందుకు ఆధార్ ఓటీపీ నమోదును తప్పనిసరి చేశారని చెప్పారు. ఆధార్‌ను నిర్ణీత సమయంలో అప్‌డేట్ చేయని కారణంతో ఆధార్ సస్పెండెడ్, క్యాన్సిల్ అవుతుందన్నారు. ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేసినా స్టేటస్‌లో మార్పులేదన్నారు. విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉన్నందున ఈ నిబంధనను తొలగించాలని కోరారు.